క్లుప్తంగా

పైపులైన్ లీకేజీ



రామాంజనేయపురంలో సాయి శ్రీనివాస గార్డెన్ ఎదురుగా పైపులైన్ లీకేజీ

కడప కార్పొరేషన్ : కడప నగరం రామాంజనేయపురంలో పీఎఫ్ క్వార్టర్స్‌కు పోయే మార్గంలో ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. సుమారు వారం రోజులుగా తాగునీరు వృథాగా కాలువలోకి ప్రవహిస్తోంది. ఇది పోను పోను పెద్దదిగా మారే అవకాశం ఉంది. ఆలోపే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కళాకారులకు సన్మానం



రంగస్థల కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : తెలుగు నాటక రంగ పితామహులు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో రంగస్థల కళాకారులను సత్కరించారు. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో రంగస్థల నటులు అరుణకుమారి, ఎస్.మధుబాబు, దాసరి సుధాకర్, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, పి.మల్లయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నూనె నాగేష్, సంయుక్త కార్యదర్శి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మేకల సుబ్బరాయుడు, రాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఘన నివాళి



సుబ్బారెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు గోసుల సుబ్బారెడ్డి మృతికి పెన్షనర్ల సంఘ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. కడప బాలాజీనగర్‌లో మంగళవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం సుబ్బారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసులు, నాగమునిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నగేష్, కోశాధికారి మల్లయ్య, జాయింట్ సెక్రటరీ సత్యరాజ్, సెక్రటరీ నాగయ్య పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు ప్రారంభం



వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది కోసం శీతలీకరణతో కూడిన ఆర్‌ఓ ప్లాంటును జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి మంగళవారం ప్రారంభించారు. వేసవి కాలంలో సిబ్బంది సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్లాంటు ఏర్పాటు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య, సీఈఓ ఓబులమ్మ, ఏపీఆర్ఐసీ ఈఈ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్లను సీఈఓ ఓబులమ్మ ఘనంగా సత్కరించారు.

విధులకు వైద్యాధికారి డుమ్మా

సిద్దవటం : మండలంలోని పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి రంగలక్ష్మి మంగళవారం విధులకు డుమ్మా కొట్టింది. పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ మంగళవారం డాక్టర్ శ్రీనివాసులరెడ్డి 104 వైద్య సేవల్లో వెలుగుపల్లిలో విధులు నిర్వర్తించారు. మరో డాక్టర్ రంగలక్ష్మి విధుల్లో లేక పోవడంతో డాక్టర్ ఎక్కడ అని వైద్య సిబ్బందిని విచారించగా ఆమెక కడప డీఎంహెచ్ఓ కార్యాలయంలో మీటింగ్‌లో ఉందని అన్నారు. రంగలక్ష్మి తరచూ విధులకు డుమ్మా కొడుతోందని, కడపలోని ప్రైవేటు క్లినిక్‌లో పనిచేస్తూ తన విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై కడప డీఎంహెచ్ఓ నాగరాజును వివరణ కోరగా మంగళవారం తమ కార్యాలయంలో ఏ ఒక్క వైద్యాధికారికి కూడా సమావేశాన్ని ఏర్పాటు చేయలేదని డాక్టర్ రంగలక్ష్మి విధులకు రాకపోవడాన్ని విచారించి ఆమెపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

బాబోయ్ ఎండలు

ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నం వేళ అయితే ఇక ఎండ వేడి భరించలేనంతగా ఉంటోంది. వివిధ పనులపై వచ్చే వారు చిన్నపిల్లలను ఎండబారి నుంచి కాపాడేందుకు టవళ్లు కప్పుకుని వస్తున్నారు. కొందరు నీరు తాగుతూ.. మరి కొందరు ఐస్‌క్రీంలు తింటూ ఉపశమనం పొందుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప













మానసిక ఆరోగ్యం ప్రతి వ్యక్తికి అవసరం

కడప అర్బన్ : కడప నగరం రిమ్స్ ఆవరణలో ఉన్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌ను జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ (నల్సా) మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు, మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం 2024 ను ప్రవేశపెట్టిందని, ఆ పథకాన్ని గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, మందులను సకాలంలో వాడి వ్యాధి తీవ్రతను తగ్గించుకోవాలని వివరించారు. అక్కడి పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం, మౌలిక సదుపాయాలను, వార్డులను ప్రత్యేకంగా పరిశీలించారు. తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, దివ్యాంగులకు హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రాముడు, డాక్టర్లు వంశీకృష్ణ, సురేష్, సాహిద్ బాష, సుబ్రహ్మణ్యం, లక్ష్మినారాయణ, మనోబంధు ఫౌండేషన్ రీజినల్ కోఆర్డినేటర్ శివారెడ్డి, మనోబంధు ఫౌండేషన్ అడ్వైజర్ మెంబర్ డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మానసిక దివ్యాంగులతో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

రోడ్డు ఎప్పుడు వేస్తారు సారూ..!

కడప కార్పొరేషన్ : కడప నగరం 20వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్‌లో పాత ఎంప్లాయిమెంట్ కార్యాలయం నుంచి నాగార్జున హైస్కూల్ వరకూ ఉన్న రోడ్డు సుమారు 18 మాసాలుగా నిర్మాణానికి నోచుకోలేదు. 2023లో రూ.3.50లక్షలతో మంజూరైన ఈ చిన్న రోడ్డును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక టీడీపీ నాయకులు అడ్డుచెబుతున్నారనే కారణంతో రెండు సార్లు రద్దు చేశారు. ఇప్పుడు మళ్లీ ఆ పనిని మంజూరు చేసినప్పటికీ టీడీపీ నాయకులు అడ్డుతగులుతూనే ఉన్నారు. రోడ్డు నిర్మాణాన్ని మొదలు పెట్టేందుకు గతంలో కాంట్రాక్టర్ కంకర, చిప్స్, ఇసుక తోలించారు. అధికార పార్టీ నాయకులు అడ్డుచెప్పడంతో సుమారు రెండునెలలుగా ఆ సామాగ్రి రోడ్డుపై ఉండేది. ప్రజల నుంచి విమర్శలు రావడంతో వాటిని ఎత్తివేయించారు. రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ మాధవి కమిషనర్‌కు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా కనీస స్పందన లేదని తెలుస్తోంది. రోడ్డు సక్రమంగా లేకపోవడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా నగర పాలక ఇంజినీరింగ్ అధికారులు స్పందించి ఈ పనులను పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.



మారుతీనగర్‌లో ఉన్న రోడ్డులో చిప్స్ పరిచి వదిలేసిన దృశ్యం

ఘన సన్మానం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడిగా నియమితులైన మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను ప్రవాసాంధ్రులు ఘనంగా సన్మానించారు. మంగళవారం కువైట్, సౌదీ అరేబియాకు చెందిన ఎన్ఆర్ఐలు ఆయన్ను కలిసి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలు ఇలియాస్, అన్సర్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తను కూడా నవ్వుతూ పలకరించి గౌరవించే నాయకుడు అంజాద్ బాషా అన్నారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిష్టించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు అన్సర్ అలీ, అబీరార్, షేక్ అన్సర్, షేక్ గయాజ్, బాబు భై, అబ్దుల్ సత్తార్, షౌకత్, అబ్దుల్ రౌఫ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

■ 20వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పీఏసీ సభ్యుడిగా ఎంపికైన అంజద్‌బాషాను ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధ్యక్షులు పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



పీఏసీ సభ్యుడిగా ఎంపికైన అంజద్‌బాషాను సన్మానిస్తున్న ఎన్ఆర్ఐలు

క్రమశిక్షణతోనే ఆధ్యాత్మిక ఉన్నతి

కడప కల్చరల్ : ఆధ్యాత్మిక ఎదుగుదలకు క్రమశిక్షణ అవసరమని హైదరాబాద్ కు చెందిన సేవా భారత్ కోఆర్డినేటర్ ఎస్. రవికుమార్ అన్నారు. మంగళవారం 'గ్రోవింగ్ లీడర్స్.. ఎదుగుతున్న నాయకులు' అనే అంశంపై స్థానిక రాజారెడ్డి వీధిలో ఉన్న షాలోమ్ ప్రేయర్ హౌస్‌లో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.స్వామిదాసు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల ఆధ్యాత్మిక జీవితానికి ఎలాంటి ఎదుగుదల అవసరం, ఎలాంటి క్రమశిక్షణ భయభక్తులు అవసరం అనే విషయాన్ని గురించి దృశ్య రూపంలో చూపించారని కొనియాడారు. దేవుని వాక్యాన్ని పాటలను, కథలను ఉదాహరణలతో చెబుతూ చెప్పారన్నారు. కార్యక్రమంలో ప్రేయర్ హౌస్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అతిథులతో కార్యక్రమ నిర్వాహకులు

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన రామగోవిందరెడ్డి మంగళవారం కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అవసరమైన గ్రామాల్లో తాగునీటి రవాణా, అద్దె బావులు, బోర్ల డీపెనింగ్, ఫ్లష్షింగ్ వంటి కార్యక్రమాలను చేపట్టాల్సిందిగా సూచించారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య పాల్గొన్నారు.



కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎం. రామగోవిందరెడ్డి

డీఎస్సీ హామీ ఏమైంది

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గత ఎన్నికలలో ఇచ్చిన డీఎస్సీ హామీ ఏమైందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపా రు. మంగళవారం నగరంలోని వెంకట సాయి కోచింగ్ సెంటర్‌లో నిరుద్యోగ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ కోసం రాష్ట్రంలో నిరుద్యోగ అభ్యర్థులు ఏడు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే డీఎస్సీ పై మొదటి సంతకం చేసి నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారని, ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వడంలేదన్నారు. మొదటి సంతకం చేసిన డీఎస్సీపై ఇంతవరకు ఎందుకు నోటిఫికేషన్ ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

బోగస్ పట్టాలను రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలోని 15వ డివిజన్ సరోజినీ నగర్ దగ్గర ఉన్న ఆచారి కాలనీలో బోగస్ పట్టాలు రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆచారి కాలనీలో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో మౌలిక వసతులు, రోడ్లు డ్రైనేజీ మంచినీటి సమస్య పరిష్కరించడంలో పాలకులు, అధికార యంత్రాంగం విఫలం చెందారని అన్నారు. ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు దళారుల చేతిలో వున్నాయని, భూకబ్జాదారులు అమ్ముకుంటున్నారని ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరి రెడ్డి, గోవిందు, నరసింహ, శేఖర్, జార్జి తదితరులు పాల్గొన్నారు.

నాకాబందీ



నాకాబందీలో పాల్గొన్న పోలీసు అధికారులు

కడప అర్బన్ : చిన్నచౌకు పీఎస్ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీలో 5 ద్విచక్ర వాహనాలు, గౌస్ నగర్ లో 2 ద్విచక్ర వాహనాలు, చింతకొమ్మ దిన్నె పరిధిలోని ఇందిరా నగర్ లో 5 , చెన్నూరు పరిధిలోని శాటిలైట్ సిటీ లో 2 , పెండ్లిమర్రి పరిధిలోని ఎల్లటూరు లో 5 , కమలాపురం సర్కిల్ కమలాపురం పరిధిలోని ఇందిరమ్మ కాలనీ లో 6 ద్విచక్ర వాహనాలు, ఒక బొలెరో క్యాంపర్ , ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. కడప తాలూకా పరిధిలోని తారకరామా నగర్ లో రికార్డులు లేని 2 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కడప వన్ టౌన్ సీఐ రామకృష్ణ, కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు, చిన్నచౌకు సీఐ ఓబులేసు, కడప రూరల్ సీఐ చల్లని దొర, చెన్నూరు సీఐ కృష్ణారెడ్డి, చింతకొమ్మ దిన్నె సీఐ శంకర్ నాయక్, కమలాపురం సీఐ ఎస్.కె రోషన్, సబ్ డివిజన్ లోని ఎస్ఐ లు, పోలీస్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

■ సిద్దవటం పరిధిలోని మాధవరం వన్ లో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ లో ఒంటిమిట్ట సీఐ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



విజయకృష్ణ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గత నెల 9వ తేదీన తన తమ్ముడు దూదేకుల విజయకృష్ణ (30)బస్సు మారే సమయంలో ఏవో కొనుక్కుని వస్తాననీ మరలా రాలేదనీ, అప్పటి నుంచి వెతికి చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నాననీ ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. తన తమ్ముడు ఇంటి నుంచి వెళ్లిపోతూ, మరలా తిరిగి వచ్చేవాడని, మానసిక అనారోగ్యంతో బాధపడుతూ వుండేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు చిన్నచౌక్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలియజేశారు. వ్యక్తి అదృశ్యం కేసును చిన్నచౌక్ ఏఎస్ఐ అబ్రహాం నమోదు చేశారు.

పెద్దకాంపల్లెలో గ్రామోత్సవం

చింతకొమ్మదిన్నె : మండలంలోని పెద్దకాంపల్లె గ్రామంలో టీటీడీ నిధులు, సహకారంతో గ్రామస్తులు కలసి నూతనంగా నిర్మించుకున్న సీతా రామాలయంలో ప్రతిష్ట చేయనున్న గణపతి, ఆంజనేయ, సీతారామలక్ష్మణ విగ్రహాలను, శ్రీరామ, సీతాదేవి, లక్ష్మణ, ఆంజనేయ దేవాతా ఉత్సవ విగ్రహాలను మంగళవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో గుడి వద్ద చెక్కభజన, కోలాటం కార్యక్రమాలు, భోజనాలు ఏర్పాటు చేశారు. బుధవారం ఆలయంలో విగ్రహాలను, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ట చేసి సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

న్యాయ సేవా సదన్‌లో సమీక్ష

కడప అర్బన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు సూచనల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కడపలోని న్యాయ సేవా సదన్‌లో 'అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్' నిర్వహించారు. వివిధ కేసులకు సంబంధించిన అంశాలను, వాటిలో మార్పు చెందిన సెక్షన్‌ల గురించి సమీక్ష నిర్వహించారు.

■ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి కె ప్రత్యూష కుమారి న్యాయ సేవా సదన్‌లో 'స్టాటిటరీ కమిటీ మీటింగ్' నిర్వహించారు. రివ్యూ వర్క్, లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లో కేసుల పరిష్కారాలు తదితర అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, కడప డిస్టిక్ రెవెన్యూ అధికారి, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.



కడపలోని న్యాయ సేవా సదన్‌లో సమీక్షలో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

డావిన్సీ చిత్రాలను ప్రేరణగా తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయంలోని లలిత కళ విభాగంలో ప్రముఖ చిత్రకారుడు 'లియోనార్డ్ డావిన్సీ' జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీ డీన్ ఆచార్య కె. గంగయ్య మాట్లాడుతూ లియోనార్డ్ డావిన్సీ బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. ఆయన చిత్రకళారంగంలోనేగాక శాస్త్రవేత్తగా, గణిత శాస్త్రవేత్తగా, ఇంజనీర్ గా, శిల్పకారుడు, వృక్షశాస్త్రజ్ఞుడు, సంగీతకారుడుగా రాణించాడన్నారు. డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ ప్రతి చిత్రకళా విద్యార్థి లియానార్డో చిత్రాలను పరిశీలించి ప్రేరణగా తీసుకోగలిగితే భవిష్యత్తులో మంచి స్థాయిలో రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తర్వాత లియోనార్డో డావిన్సీ కి సంబంధించి డాక్యుమెంటరీ చిత్రాన్ని డిపార్టమ్మెంట్‌లో ప్రదర్శించారు.



లియోనార్డో డావిన్సీ డాక్యుమెంటరీ చిత్రం వద్ద వివిధ విభాగాధిపతులు

ఉత్తమ ర్యాంకులు సాధించాలి

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా పాలిసెట్ కోచింగ్ తీసుకుంటున్న ప్రతి విద్యార్థి ఉత్తమ ర్యాంకు సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి సూచించారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం కోచింగ్ తీసుకుంటున్న దాదాపు 200 మంది విద్యార్థులకు మంగళవారం పాలిసెట్ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 2వ తేదీ నుంచి పాలిసెట్-2025 పరీక్ష కోసం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా కోచింగ్ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు సుమారు 200 మంది కోచింగ్ కోసం వస్తున్నట్లు తెలిపారు. పాలిసెట్ ఎంట్రన్స్ టెస్టు ఏప్రిల్ 30వ తేదీ జరగనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో అందరూ మంచి ర్యాంకులు సాధించాలనే లక్ష్యంతోనే వారికి ఉచితంగా మెటీరియల్‌ను అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ శ్రీనివాసరావు, సుధారాణి, దామోదరం, సుమతి పాల్గొన్నారు.



ఉచితంగా మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధం

కడప రూరల్. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీల మీద నరమేధాన్ని కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధమని వక్తలు అన్నారు. మంగళవారం స్థానిక వైయస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గోపాల్ మాట్లాడారు. ప్రధానంగా మావోయిస్టుల అణచివేత పేరుతో అన్యం పుణ్యం ఎరుగని అడవి బిడ్డలను అణచివేతకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాయలసీమ కార్మిక సమాఖ్య నాయకులు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అడవుల నుంచి ఆదివాసీలను వాళ్లకు అండగా ఉన్న మావోయిస్టులను తరిమి వేయడం ద్వారా అడవులను బడా కార్పొరేటర్లకు అప్పగించడానికి కుట్ర జరుగుతోందన్నారు. ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధమని, దీన్ని ప్రతి ఒక్కరు ఖండించాలని తెలిపారు.



మాట్లాడుతున్న రవిశంకర్ రెడ్డి తదితరులు

రాహుకాల పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయ ఆవరణలో తొలుత నిమ్మకాయల దీపాలను వెలిగించి అమ్మవారిని ఆరాధించారు. అనంతరం ఆ ప్రాంగణంలో అర్చకుల సూచనల మేరకు రాహుకాల పూజలు నిర్వహించారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రూటే..సపరేటుపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

కడప రూరల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన అవినీతిపై గడి చిన మార్చి 7వ తేదీన సాక్షిలో రూటే..సప'రేటు' అనే కథనాన్ని ప్రచురించింది. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పందించి విచారణకు ఆదేశించారు. ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి ఎం.పుల్లమ్మ మెడికల్ లీవ్‌కు సంబంధించిన వ్యవహారంలో అక్కడ పనిచేసే అధికారి అక్రమాలకు పాల్పడ్డారు. అందుకు ప్రత్యక్ష సాక్షి పుల్లమ్మతో పాటు ఆమె కుమారుడు ఉన్నారు. కలెక్టరేట్ నుంచి వచ్చిన సిబ్బంది పుల్లమ్మతోపాటే ఆమె కుమారుడిని విచారించారు. వారు అక్కడి అధికారి తమ పట్ల ఏవిధంగా అమర్యాదగా ప్రవర్తించింది, ఎంత డబ్బులు ఇచ్చింది చెప్పారు. ఆ వివరాలను వచ్చిన అధికారులు స్టేట్‌మెంట్ రూపంలో తీసుకున్నారు. ఈ అంశాలను పరిశీలించిన తరువాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏఓ శ్రీదేవిని డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేస్తూ కలెక్టర్ ఆదేశించారు. దీనిపై మరింత సమగ్రంగా విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించడంతో మరో మారు మంగళవారం విచారణ చేపట్టారు. విచారణ అధికారిగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ వ్యవహరించారు. విచారణలో భాగంగా ఉద్యోగి పుల్లమ్మతో పాటు ఆమె కుమారుడి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ అంశానికి సంబంధించి చివరగా మూడోసారి విచారణ చేపట్టనున్నట్లుగా తెలిసింది. కాగా ఈ అంశాన్ని అక్కడ పనిచేసే ఉద్యోగులు ప్రక్కదారి పట్టేలా ప్రయత్నాలు సాగించినట్లుగా సమాచారం.

దుంపలగట్టు అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఖాజీపేట : దుంపలగట్టు అంకాలమ్మ జాతరను పురస్కరించుకుని చివరి రోజు మంగళవారం ఆలయంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్యం ఆదినారాయణరెడ్డిల ప్రత్యేక ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ రామగోవిందరెడ్డి, బి.మఠం ఎంపీపీ వీరనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుంపలగట్టు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు